# విద్యుక్త ధర్మం





**- ఎం.వెంకటేశ్వరరావు**

రాజ్‌భవన్ నుండి గవర్నరు కారు బయల్దేరింది. ముందు కాన్వాయి, ఎస్కార్టు కార్లు. మార్గంలో చీమ కూడా సంచరించకుండా ట్రాఫిక్ నిలిపేశారు. వైర్‌లెస్ సెట్లలో వస్తున్న ఆదేశాల ప్రకారం "ఉఁయ్, ఉఁయ్"మని సైరన్ల శబ్దాలతో కార్లు వేగంగా వస్తున్నాయి. ఒకే నంబరు, ఒకే మోడలుతో ఉన్న నాల్గు బుల్లెట్ ప్రూఫ్ కార్లలో గవర్నరు ఏ కారులో ఉన్నదీ తెల్సుకోలేనంత పకడ్బందీగా కార్లు పరుగెడుతున్నాయి.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లో అధికారంలో ఉన్న పార్టీ జరుపుకుంటున్న మహాసభకి ప్రధానమంత్రి, హోంమంత్రులతోబాటు అనేక మంది కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆ సభలో పాల్గొనేందుకు హాజరవుతున్నారు.

మహాసభకోసం జంట నగరాల్లోని ముఖ్యరహదారుల్లో పెద్ద పెద్ద బ్యానర్లు, మంత్రుల కటౌట్లు, భారీ వినైల్ పోస్టర్లు, పార్టీ జెండాలతో అలంకరించారు. ఏ వైపు చూసినా రంగురంగుల విద్యుద్దీపాలు కళ్ళు మిరుమిట్లు గొల్పుతున్నాయి.

సికింద్రాబాదు పేరేడ్‌గ్రౌండ్స్ మహాసభ కోసం సర్వాంగ సుందరంగా తయారైంది. గ్రౌండంతా ప్లాస్టిక్ కుర్చీలు, వి.ఐ.పి, వి.వి.ఐ.పిలకి ప్రత్యేక రక్షణ వలయం, జర్నలిస్టుల కోసం ప్రత్యేక విభాగం, కళ్ళు మిరుమిట్లు గొలిపే లైట్ల మధ్య సినిమా సెట్టింగులా వెలిగిపోతున్న భారీ వేదిక, దానికి సమీపంలో అంబులెన్సులు, ఫైరింజన్లు. గ్రౌండులో పార్టీ నాయకుల భారీ కటౌట్లు ఎటు తల తిప్పినా దర్శనమిస్తున్నాయి.

★ ★★

ఎస్కార్టు జీపులోనుంచున్న సెక్యూరిటీ గార్డు సూర్యానికి వైర్‌లెస్ సెట్లో ఆదేశాలు విన్పిస్తున్నాయి. అతని కళ్ళు చుట్టూ ఉన్న పరిసరాల్ని స్కాన్ చెయ్యటంలో షార్ప్‌గా పన్జేస్తున్నాయి. వైర్‌లెస్ సెట్లో "లిటిల్ స్లో, లిటిల్ స్లో"అనే ఆదేశం అందటంతో కాన్వాయ్ వేగం కొద్దిగా తగ్గింది. రోడ్డుకిరువైపులా నిలబడ్డ జనం వింతగా చూస్తుంటే, వాళ్ళలో ఎవరైనా తీవ్రవాదులున్నారేమోనని ఎస్కార్టు గార్డ్ల కళ్ళు పరిశీలిస్తున్నాయి. సూర్యం కళ్ళు అదేపని చేస్తుంటే సడన్‌గా అతని దృష్టి ఇద్దరు పిల్లల్ని పక్కన నుంచోబెట్టుకుని, కార్లవైపు చూస్తున్న యువతి మీద క్షణంసేపు ఆగాయి. అతను నిలబడ్డ కారు అంతలోనే వేగాన్నందుకుంది. కార్ల స్పీడు పెంచమన్న ఆదేశాలకనుగుణంగా కార్లు వేగంగా దూసుకెళ్తున్నా, మనసు మాత్రం రోడ్డుపక్కన నిలబడ్డ యువతి, ఆమె పక్కనున్న పిల్లల దగ్గరకి రివర్సులో వచ్చి చూసి, అత్తగారి ఊళ్ళో ఉన్న భార్యాపిల్లల దగ్గరకి వాయువేగంతో వెళ్ళింది.

★ ★★

"ఖచ్చితంగా మీరు వెళ్ళే తీరాలా? నాకెందుకో భయంగా ఉందండీ" అంది భార్య పద్మ.

"ఈ సెక్యూరిటీ గార్డు ఉద్యోగానికి అప్లయ్ చేసేటపుడు నీతో చెప్పానుగా! అప్పుడు లేని అభ్యంతరం, ఇప్పుడెందుకు?"

"అప్పుడు... ఏదో... అన్నాను. ఎంత సరిపెట్టుకుందామనుకున్నా మనసు అంగీకరించడం లేదు. ఏ క్షణాన ఏం జరుగుతుందో తెలీదు. రెండ్రోజుల్నుంచీ పిచ్చి పిచ్చి కలలొస్తున్నాయి. మనకొద్దు. ఉన్న ఉజ్జోగం చాలు" అంది భర్తకి అన్నం పెడుతూ.

"ఇప్పుడొద్దంటే ఎలా?! రాజధానిలో జరిగే మహాసభకి కేంద్ర మంత్రులకి, గవర్నర్లకి సెక్యూరిటీగా వెళ్ళటం చిన్న విషయం గాదు. వందల మందిలో ఎన్నుకున్న కొద్ది మందిలో నేనూ ఒకణ్ణి గావటం గర్వంగా లేదూ"అంటూ చెయ్యి కడుక్కొచ్చేసరికి, మౌనంగా యూనిఫాం తెచ్చిచ్చింది- పద్మ. సూర్యం షర్టు తగిలించుకుంటుంటే...

★ ★★

ముందెళ్తున్న ఎస్కార్టు కారులో 'బీప్, బీప్'మని శబ్దం విన్పించేసరికి, సూర్యం మనసు అలర్టయి, వేగంగా వెనక్కి తిరిగొచ్చింది. వెనకాలొస్తున్న కార్ల వేగం తగ్గింది. అంతలోనే వైర్‌లెస్ సెట్లలో "నథింగ్ ప్రొసీడ్" అని ఆదేశాలు విన్పించడంతో సూర్యం మనసు తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది.

కార్లన్నీ మళ్ళీ మామూలు వేగంతో వెళ్తున్నాయి. సూర్యం మనసు మళ్ళీ ఇంటికెళ్ళింది.

★ ★★

షర్టు బటన్ పెడుతూ, "ఈ మహాసభకి వచ్చే మంత్రులు కొంతమంది తమ హిట్‌లిస్ట్‌లో ఉన్నారని, వాళ్ళని ఎట్టి పరిస్థితుల్లోనూ హతమారుస్తామని ఓ తీవ్రవాద సంస్థ ప్రకటించిందట గదా!" అంది పద్మ.

"ఎవరు చెప్పారు నీకు?"

"పేపర్లో చదివాను" అనెళ్ళి పేపరు తెచ్చి చూపించింది.

"పిచ్చి పద్మా! ఇలాంటి బెదిరింపులతో ప్రజలలో భయాందోళనలు కల్గించి, తమ ఉనికిని చాటుకోవటం తీవ్రవాద సంస్థలకిది మామూలే. ఇలాంటి వాటన్నిటినీ అధిగమించటానికి, ప్రత్యేక శిక్షణ పొందిన బాంబు స్క్వాడ్, తర్ఫీదు పొందిన జాగిలాలు, జామర్లు, సుశిక్షితులైన ఎస్కార్ట్లు ఎంతోమంది ఉంటారు" అంటూ పద్మని మళ్ళీ మాట్లాడనివ్వలేదు. పద్మ మౌనంగా లోపలికెళ్ళింది.

ఉగాది పోటీలో ఎంపికైన కథ

★ ★★

చేతిలో ఉన్న వైర్‌లెస్ సెట్లో వస్తున్న "బి అలర్ట్, బి అలర్ట్"అనే ఆదేశానికి ఒక్కసారిగా ఉలిక్కిపడి అలర్టయ్యాడు సూర్యం. కార్లు ఖైరతాబాదు బ్రిడ్జి దాటి ఐ-మాక్స్ థియేటర్స్ మీదుగా ట్యాంకుబండుపై వెళ్తున్నాయి. ఐ-మాక్సు థియేటర్‌ని యాధృచ్ఛికంగా చూసిన సూర్యానికి, ఇంటి నుండి తను బయల్దేరుతున్నప్పటి క్షణాలు కళ్ళముందు కదిలాయి.

★ ★★

ఆరోజే సూర్యం హైదరాబాదు బయల్దేరుతున్నాడు. ఆ రోజంతా సూర్యం ఎంత సంతోషంగా ఉన్నాడో, పద్మ అంత విచారంగా ఉంది. భార్య మొహంలో చిన్న చిర్నవ్వు తెప్పించడానికి ఎన్నో విఫల ప్రయత్నాలు చేసి, చేసి విసిగి...

"పోనీ కాన్సిల్ చేసుకోమంటావా?" అన్నాడు తీవ్రంగా.

మౌనంగా వద్దన్నట్టు తలూపింది.

"మరింకేంటి?"

"మీకెన్నిసార్లు చెప్పాను, ఊరెళ్ళేటప్పుడు పిల్లలకేం కావాలో పిలిచి అడగమని."

"ఓ!... అదా!... హడావిడిలో మర్చేపొయ్యాను" అని, "రేయ్ తేజా! స్వప్నా! ఇలా రండి"అని పిల్చాడు.

ఎనిమిదో తరగతి కూతురు స్వప్న తనక్కావాల్సిన వన్నీ ముందుగా రాసి పెట్టుకున్న లిస్టు తండ్రికి చూపుతూ.

"డాడీ! చార్మినార్ దగ్గర గాజులు చవగ్గా దొరుకుతాయంట, ముత్యాలు కూడా చీప్‌గా కొనొచ్చంట, చుడిదార్లు, మిడీలు కూడా తక్కువ ధరలకే దొరుకుతాయంట" అని చెబుతుంటే...

"ఇవన్నీ ఎక్కడ దొరుకుతాయో నాకు తెలీదే... అన్నాడు కూతురు వైపు అమాయకంగా చూస్తూ.

"బిగ్‌బజార్, జనరల్ బజార్, కోఠి, ఆబిడ్స్..." ఫుల్‌స్టాప్ పెట్టకుండా చెబుతున్న అక్కవైపు సీరియస్‌గా చూసి, "నన్నూ కొంచెం చెప్పనియ్యవే" అన్నాడు తేజ తండ్రి ఒళ్ళో ఒదుగుతూ.

"బుల్లి రాజావారికేం కావాలంట?" కొడుకు దగ్గరగా పొదువుకుని అడిగాడు సూర్యం.

"నాకూ ... నాకూ... చార్మినార్, టాంకుబండు, క్రికెట్ స్టేడియం, ఊఁ... ఇంకా... ఐమాక్సులో చిరంజీవి సినిమా చూపిస్తావా?" అన్నాడు.

"ఇవన్నీ నేనూ చూళ్ళేదు. ఈ పేర్లన్నీ తమకెలా తెల్సాయి సార్." అన్నాడు కొడుకు మాటలకి మురిపెంగా.

ఐదో తరగతి చదువుతున్న తేజ టి.వి. వైపు చెయ్యి చూపడంతో సూర్యంతోబాటు పద్మ ఆశ్చర్యపోయింది.

"ఈసారి హైదరాబాదు డ్యూటీకెళ్ళొస్తే మనకి బోల్డన్ని డబ్బులొస్తాయి. మనమందరం కల్సెళ్ళి అన్నీ చూసొద్దాం. సరేనా!" అని పిల్లలకి నచ్చజెప్పి బయల్దేరాడు.

* * *

కాన్వాయి లుంబినీ పార్కు దాటి టాంకుబండు మీదికొచ్చింది. సైరన్ల మోతలో, అందుతున్న ఆదేశాల మేరకు ఎస్కార్ట్లంతా పరిసరాల్ని డేగ కళ్ళతో పరిశీలిస్తున్నారు.

టాంకుబండు మీద విగ్రహాల్ని చూసి సూర్యానికి లోలోపల కించిత్ గర్వం కల్గింది. ఎక్కడో పల్లెటూళ్ళో పుట్టిపెరిగిన తనివ్వాళ దేశ ప్రముఖులకి సెక్యూరిటీలో ఒకడిగా సెలక్టవటం దానికి కారణం.

ఆరోజే ఇంటికొచ్చిన సూర్యం భార్యాపిల్లల్ని విజయవాడ సమీపంలో ఉన్న అత్తగారి గ్రామంలో వదిలి హైదరాబాదు చేరాడు.


హైదరాబాదు పోలీస్ అకాడమీలో మధ్యాహ్నం నుండి క్లాసులు మొదలయ్యాయి. ఏ రూట్లో ఏ మంత్రి కారు వెళ్ళాల్సింది, బాంబుల ఉనికి ఎలా కనుగొనాల్సింది, కాన్వాయి ఎంత దూరంలో ఉండాలి, జామర్లు ఎలా వాడాలి, జాగిలాల గురించి... ఇలా ఎన్నో అంశాల గురించి, సెక్యూరిటీ గురించి చెప్పారు.

మర్నాడుదయం గజగజ వణికిస్తున్న చలిలో డ్రిల్లు, పేరేడ్‌లతోబాటు జామర్లు ఉపయోగించే విధం, బాంబులు కన్పిస్తే ఏం చెయ్యాలో ప్రాక్టికల్‌గా నేర్పించారు.

తెలియని ఎన్నో విషయాలు తెల్సుకున్న ఉత్సాహం, ఎటువంటి బాంబులు ఏ మూలపెట్టినా ఏరిపారెయ్యగలనన్న ధైర్యం, దేశభక్తి సూర్యం రక్తంలో ఉప్పొంగాయి.

గవర్నరుకి నియమించబడ్డ సెక్యూరిటీ గార్డుల్లో సూర్యం ఒకడు. ఆరోజు సాయంత్రం మహాసభ.

రాజ్‌భవన్‌కి వెళ్ళిన ఎస్కార్టు బృందంతో సూర్యం వెళ్ళాడు. గవర్నరుకి ప్రోగ్రాం, వెళ్ళే రూటు వివరించారు. ఆయన సెక్యూరిటీ బృందాన్ని మెచ్చుకోలుగా చూడటం సూర్యానికి రెట్టింపు ఉత్సాహాన్నిచ్చింది.



హైదరాబాదు పోలీస్ అకాడమీలో మధ్యాహ్నంనుండి క్లాసులు మొదలయ్యాయి. ఏ రూట్లో ఏ మంత్రి కారు వెళ్ళాల్సింది. బాంబుల ఉనికి ఎలా కనుగొనాల్సింది. కాన్వాయి ఎంత దూరంలో ఉండాలి. జామర్లు ఎలా వాడాలి. జాగిలాల గురించి... ఇలా ఎన్నో అంశాల గురించి. సెక్యూరిటీ గురించి చెప్పారు.

ఆలోచిస్తున్న సూర్యానికి ఎవరో సడన్ బ్రేకేసినట్టు ముందెళ్తున్న ఎస్కార్టు కారులో ఉన్నట్టుండి "బీప్, బీప్"మని శబ్దం రావటంతో కార్లన్నీ మేరియట్ హోటల్‌కి సమీపంలో ఉన్న కమానుకి కొంత దూరంలో ఆగిపోయాయి.

వైర్‌లెస్ సెట్లలో "వాట్ హేపెన్డ్" అధికారుల ఆగ్రహం.

"ఇక్కడెక్కడో బాంబు ఉన్నట్టు అనుమానం" సెక్యూరిటీ హెడ్ బదులు. "క్లియరిట్ ఫాస్ట్, డైవర్ట్ ఫాస్ట్" ఆదేశం. సూర్యం ఉన్న ఎస్కార్ట్ జీప్‌నుండి అందరూ బాంబు డిటెక్టర్లతో కిందికి దిగారు. వాళ్ళతోబాటు ప్రత్యేక శిక్షణ పొంది బాంబు స్క్వాడ్ రంగంలోకి దిగింది. వాళ్ళు ముందెళ్తున్నారు. బాంబు డిటెక్టర్ల మోత వేగాన్నందుకుంది.

ఆ ప్రదేశాన్నంతా పరికిస్తున్న సూర్యం కళ్ళకి కమాను మొదట్లో తవ్వినట్టు కన్పించడంతో... "సంథింగ్ ఈజ్ దేర్"అని అరిచాడు. బాంబు స్క్వాడ్ అటువైపు వెళ్తుంటే, వాళ్ళతో సూర్యం ఉన్నాడు.

వెనక నుండి, "డోన్ట్ మూవ్, డోన్ట్ మూవ్, డోన్ట్ టచ్, కంబ్యాక్" అని ఎస్కార్ట్ కమాండర్ అరుస్తున్న అరుపులు వాళ్ళకి వినిపించే లోపల...

"ఢమాల్! ఢమాల్!! ఢమాల్!!!" దిక్కులు పిక్కటిల్లే శబ్దం. పవర్‌ఫుల్ ఆర్డీఎక్స్ బాంబు పేలి, క్షణంలో ఆ ప్రదేశపు రూపురేఖలు మారిపొయ్యాయి. సూర్యంతోబాటు మరో ఇద్దరు సెక్యూరిటీ గార్డ్లు, ఇద్దరు బాంబు డిటెక్టింగ్ స్క్వాడ్ల శరీరాలు రక్తపు మడుగులో మాంసం ముద్దల్లా గుర్తించలేనంతా ఆ ప్రదేశంలో చెల్లాచెదురుగా పడిపొయ్యాయి.

హాహాకారాలు, సైరన్ల మోతలు, అరుపులు, ఆర్తనాదాలు విన్పించసాగాయి. ఆ ప్రదేశమంతా పొగ మంచులా కమ్ముకుంది.

* * *

"తీవ్రవాదుల దుశ్చర్య సెక్యూరిటీ వైఫల్యంవలన జరిగిన బాంబు దాడి నుండి ప్రాణాలతో బయటపడ్డ రాష్ట్ర గవర్నరు"అన్ని టి.వి. ఛానెళ్ళూ సెకనుకోమారు క్లిప్పింగ్స్ చూపిస్తూ ప్రసారం చేస్తున్నాయి. ప్రముఖులంతా ఈ సంఘటనపై తీవ్ర దిగ్భ్రాంతిని తెలుపుతున్నారు.

"బాంబు దాడి ప్రాంతంనుండి హుటాహుటిన సురక్షిత ప్రాంతానికి గవర్నరుని తీసుకెళ్ళారు. అక్కడ ఆయన కారు దిగుతుంటే, దురదృష్టవశాత్తు ఆయన చేతికి కారు డోరు తగిలి స్వల్పగాయం అయిన కారణంగా, సమీపంలో ఉన్న ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రికి గట్టి బందోబస్తు మధ్య తరలించారు. ఆ ఆస్పత్రికి ఐదు కిలోమీటర్ల దూరంలోనే ట్రాఫిక్ నిలిపేశారు. ఎవర్నీ లోపలికి అనుమతించడం లేదు." టి.వి. ఛానెళ్ళు ఫ్లాష్ న్యూస్‌తో ఘోషిస్తున్నారు.

గవర్నరు ప్రాణాలు కాపాడటానికి అసువులు బాసిన ఐదుగురు సెక్యూరిటీ గార్డుల వివరాలు టి.వి. ఛానెళ్ళకు అందించే నాథుడు కరువయ్యాడు.

"ఐదుగురు సెక్యూరిటీ గార్డ్లు బాంబు పేలుడు ప్రమాదంలో మరణించారని, వాళ్ళ శరీర భాగాలు గుర్తించలేనంతగా చెల్లాచెదురయ్యాయని, పూర్తి వివరాలింకా అందలేదని" టి.వి.లో ఒకసారి ప్రకటించారు.

* * *

ఆ క్షణంలో...

మరో రెండ్రోజుల్లో భర్త హైదరాబాదు నుండి తిరిగొస్తాడు, అలవెన్సు డబ్బులు తెస్తాడు. త్వరలో అతనికి ప్రమోషనొస్తుంది. హైదరాబాదుకి బదిలీ అవుతుంది. పిల్లల్ని మంచి స్కూళ్ళలో చదివించొచ్చని" సూర్యం భార్య పద్మ.

"నాన్నొస్తాడు రంగురంగుల గాజులు, మంచి మంచి డ్రెస్సులు తెస్తాడని" స్వప్న లోకంలో కలలుగంటున్న కూతురు స్వప్న.

"మా డాడీ ఊర్నుంచి రాగానే మేమందరం హైదరాబాదెళ్ళి, చార్మినార్, టాంకుబండు, మ్యూజియం, జూ... అన్నీ చూస్తాం. ఐమాక్సు థియేటర్‌లో చిరంజీవి సినిమా చూస్తాం తెలుసా! అని ఆ పల్లెటూళ్ళో ఫ్రెండ్స్‌తో గొప్పగా చెప్పుకుంటున్నాడు కొడుకు తేజ.

సూర్యం భార్యపిల్లలు ఉన్న ఆ గ్రామంలో, ఆ సమయంలో ప్రభుత్వం "విద్యుత్‌ధర్మానికి" విధించిన "కరంటు కోత" వలన, ఈ సంఘటన ఏ టి.వి.లోనూ ప్రసారం కాలేదు.

* * *

రెండ్రోజుల తర్వాత

పదవిలో ఉన్న నాయకుల ప్రాణాలు కాపాడటంకోసం విధ్యుక్త ధర్మ నిర్వహణలో ప్రాణాలు పణంగాపెట్టి అసువులు బాసిన ఐదుగురు సెక్యూరిటీ గార్డ్ల ప్రాణాలకి వెల ప్రకటించి చేతులు దులుపుకుంది ప్రభుత్వం. వాళ్ళలో అస్తమించిన సూర్యుడు ఒకడు. ★